సాక్షి
బాపట్ల
సోమవారం : 20 : ఫిబ్రవరి : 2023



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 42.6213 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుంచి 2000 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. దిగువకు 4200 క్యూసెక్కులు వదులుతున్నారు.



భక్తిశ్రద్ధలతో సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి: ఇంద్రకీలాద్రిపై ఆదివారం దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ జరిగింది. సూర్యభగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

కరోనా జీరో

గుంటూరుమెడికల్: జిల్లా వ్యాప్తంగా ఆదివారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.



న్యూస్‌రీల్

త్రికోటేశ్వరుని ఆదాయం రూ.1.73 కోట్లు



నరసరావుపేట రూరల్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి ఆలయానికి రూ.1,73,67,389 ఆదాయం లభించింది. ఆలయంలో హుండీల లెక్కింపును ఆదివారం నిర్వహించారు. హుండీల ద్వారా రూ.72,44,803లు లభించగా, పూజా టికెట్ల ద్వారా రూ.65,01,240, ప్రసాదాల విక్రయం ద్వారా రూ.35,00,025, అన్నప్రసాద వితరణకు రూ.1,21,321 వచ్చినట్టు పేర్కొన్నారు. దీంతో పాటు 1.9 గ్రాముల బంగారం, 367 గ్రాముల వెండి హుండీ ద్వారా భక్తులు సమర్పించినట్టు వివరించారు. గత ఏడాది మహాశివరాత్రి సందర్భంగా రూ.1,69,36,870 ఆదాయం రాగా ఈ ఏడాది రూ.4,30,519 అదనంగా వచ్చినట్టు తెలిపారు. హుండీ లెక్కింపును దేవదాయ శాఖ అడిషనల్ కమిషనర్ చంద్రకుమార్, డెప్యూటీ కమిషనర్ చంద్రశేఖరరెడ్డి, జిల్లా దేవదాయ అధికారి సత్యనారాయణరెడ్డి, ఆలయ ఈవో వేమూరి గోపి పర్యవేక్షించారు.

క్వారీ తిరునాళ్ల ఆదాయం రూ.13.72 లక్షలు



చేబ్రోలు: వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి దేవస్థానం తిరునాళ్ల సందర్భంగా హుండీ ఆదాయం గత ఏడాది కన్నా ఈ ఏడాది గణనీయంగా పెరిగినట్లు దేవదాయశాఖాధికారులు తెలిపారు. వడ్లమూడి క్వారీ దేవస్థానం వద్ద ఆదివారం దేవదాయ శాఖాధికారులు హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. దేవదాయశాఖాధికారులు, స్థానిక పెద్దల సమక్షంలో హుండీ లెక్కింపు నిర్వహించారు. మొత్తం రూ.13,71,879 ఆదాయం వచ్చినట్లు దేవదాయశాఖాధికారి పోతుల రామకోటేశ్వరరావు తెలిపారు. హుండీ నుంచి రూ.7,69,259 ఆదాయం వచ్చింది. అభిషేకాలు, ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా రూ.5,18,926, కొబ్బరిచిప్పలు, కొబ్బరికాయలు, పొంగళ్లకు గ్యాస్ పొయ్యిలు బహిరంగ వేలం ద్వారా రూ.83,700 ఆదాయం సమకూరినట్లు పేర్కొన్నారు. అన్నిక లిపి దేవస్థానానికి మొత్తంగా రూ.13,71,879 ఆదాయం సమకూరింది. గత ఏడాది రూ.11,25,320 ఆదాయం రాగా, ఈ సంవత్సరం అదనంగా రూ.2,46,559 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మోరంపూడి అనితారాణి, చీమకుర్తి శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ బంగ్లా నిర్మాణ పనుల పరిశీలన



నరసరావుపేట: పల్నాడు బస్టాండ్ సమీపంలోని పెద్దచెరువు ప్రాంతంలో నూతనంగా నిర్మిస్తున్న కలెక్టర్ బంగ్లా పనులను జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పరిశీలించారు. ఆదివారం బంగ్లాలో కొనసాగుతున్న పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ బంగ్లాకు రెండు వైపులా ఉన్న మురుగు కాలువలను మరింత మెరుగుపరిచి, వాటిపై పకడ్బందీగా మూతలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ డి.రవీంద్రను కలెక్టర్ ఆదేశించారు. సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురై వినియోగంలో లేకపోవడంతో వెంటనే బాగు చేయించాలని, లేకుంటే నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని విద్యుత్‌శాఖ ఏడీఈ వై.ఏడుకొండలుకు సూచించారు. కార్యక్రమంలో రహదారులు, భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాజానాయక్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం వివరాలు

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 554.70 అడుగుల వద్ద ఉంది. ఇది 220.2524 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 10,200, ఎడమకాలువకు 9,076, ఎస్ఎల్‌బీసీకి 2,200, వరదకాలువకు 320 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 21,796 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 21,796 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 828.8 అడుగుల వద్ద ఉంది. ఇది 48.3290 టీఎంసీలకు సమానం.

సంతోషాలు మింగిన మృత్యువు

- మేదరమెట్ల జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు దుర్మరణం
- నలుగురు గుంటూరు తుఫాన్‌నగర్ వాసులు
- ఎస్ఐ కుటుంబంలో పెను విషాదం
- భార్య, కుమార్తె మృతదేహాలను చూసి కన్నీరుమున్నీరైన ఎస్ఐ సముందర్‌వలి
- కారు టైర్ పంచర్ కావడంతో చోటుచేసుకున్న ప్రమాదం
- మృతదేహాలు గుంటూరు తరలింపు
- డ్రైవర్ వీరబ్రహ్మాచారి మృతదేహాన్ని అద్దంకి తరలింపు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు



షేక్ వహిదావలి, కుమార్తె ఆయేషా హుమేరావలి మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

లక్ష్మీపురం(గుంటూరు): ఆ కుటుంబాల మధ్య స్నేహంపై విధికి కన్నుకుట్టింది. ఇరుగుపొరుగున ఉంటూ చిగురించిన స్నేహం చివరకు మృత్యువులోనూ తోడుగా సాగింది. ప్రకాశం జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిల్చింది. మహాశివరాత్రి సందర్భంగా కారులో చిన్నగంజాం తిరునాళ్లకు వెళ్లి అక్కడ నుంచి అద్దంకి బయలుదేరగా, కొరిశపాడు మండలం మేదరమెట్ల భ్రమర వెంచర్ సమీపంలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో పెనువిషాదం నింపింది. కారు టైర్ పంచర్ కావడంతో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని వాహనం అవతల రోడ్డు వైపునకు వెళ్లింది. అదే సమయంలో విజయవాడ నుంచి చెన్నై వెళ్తున్న కంటైనర్ లారీ కారును ఢీకొనడంతో డ్రైవర్‌తో పాటు నలుగురు అక్కడికక్కడే మృత్యుఒడికి చేరిన సంఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మృతి చెందిన వారిలో నలుగురు గుంటూరు నగరం మారుతీనగర్ ఆర్చి సెంటర్ పరిధిలో ఉన్న తుఫాన్ నగర్ యాగంటి అపార్ట్‌మెంట్స్ వాసులు. డ్రైవర్ అద్దంకికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. మృతులు గుంటూరుకు చెందిన మెహముదా, ఇమాంసా కుమార్తె షేక్ వహిదావలి (38), ఆమె కుమార్తె షేక్ ఆయేషా హుమేరావలి (9), అదే ప్రాంతానికి చెందిన గుర్రాల జయశ్రీ (50), ఆమె కుమార్తె గుర్రాల దివ్యతేజ (29), అద్దంకి ప్రాంతానికి చెందిన డ్రైవర్ వీరబ్రహ్మాచారి (22)గా పోలీసులు నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను గుంటూరుకు తీసుకువచ్చారు.

కన్నీటిపర్యంతమైన సన్నిహితులు..

మృతురాలు వహిదా, కుమార్తె ఆయేషా హుమేరా వలి, జయశ్రీ, దివ్యతేజ మృతదేహాలను చూసిన స్థానికులు కన్నీటిపర్యంతమయ్యారు. ఎలాంటి శుభకార్యం జరిగినా, పండుగలు జరుపుకున్నా కలిసి ఉండే ఈ కుటుంబాలు చివరి క్షణంలో కూడా కలిసే అనంతలోకాలకు చేరడంపై చలించిపోయారు. కులాలు, మతాలు వేరైనా ఒకే ప్రాంతంలో ఉంటూ ఒక తల్లీబిడ్డలుగా కలిసి ఉండే ఈ నలుగురు రోడ్డు ప్రమాదంలో కలిసి తుదిశ్వాస విడవడంపై స్థానికులు శోక సంద్రంలో మునిగిపోయారు.

నేను ఎవరికోసం బతకాలి..

నేను ఇక ఎవరి కోసం బతకాలి.. నాకు ఇక ఎవరు ఉన్నారు.. అంటూ భార్య, కుమార్తె మృతదేహాలను చూసి ఎస్ఐ సముందర్‌వలి గుండెలవిసేలా రోదించారు. అద్దంకి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న షేక్ సముందర్‌వలి భార్య షేక్ వహిదా వలి, కుమార్తె షేక్ ఆయేషా హుమేరావలితో ఎంతో ప్రేమగా ఉండేవారు. ఎస్ఐ సముందర్‌వలి మృతదేహాలను చూసి కన్నీరుమున్నీరు అవ్వడం స్థానికులను కలచివేసింది. మృతురాలు వహిదా చిన్నతనం నుంచి క్రీడల్లో ప్రతిభచూపి రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక పతకాలు కైవసం చేసుకున్నారు. ఆ క్రమంలో పరిచయమైన షేక్ సముందర్‌వలిని ప్రేమించి వివాహం చేసుకుంది. వీరి కుటుంబంతో ఎంతో ప్రేమగా, సొంత కుటుంబ సభ్యులుగా ఉండే మృతురాలు గుర్రాల జయశ్రీ, ఆమె కుమార్తె గుర్రాల దివ్యతేజ ఈ ప్రమాదంలో మృతి చెందడం రెండు కుటుంబాల్లో అంతులేని విషాదం నింపింది.

చిన్నతనం నుంచి నా బిడ్డలా ఉండేది

నా పేరు శివాజీ. నేను అథ్లెటిక్స్ కోచ్‌ను. నా వద్దకు మృతురాలు షేక్ వహిదా 6వ తరగతి నుంచి క్రీడా శిక్షణకు వచ్చేవారు. డిస్కస్‌త్రో శిక్షణ పొంది రాష్ట్ర స్థాయిలో అనేక పోటీల్లో బంగారు పతకాలను పొందింది. జాతీయ క్రీడా పోటీల్లో సైతం సత్తా చాటింది. ఇంతటి ఘోరం జరగడం నా మనసును కలచివేసింది. నా చేతిలో పెరిగిన బిడ్డను కోల్పోయినంత బాధను అనుభవిస్తున్నాను. పసిబిడ్డ సైతం ప్రమాదంలో మృతి చెందడం చాలా బాధాకరం.

చేతికి అందివచ్చిన కొడుకు మృతితో..

కారు డ్రైవర్ కొండమూది వీరబ్రహ్మాచారి (22) స్వగ్రామం అద్దంకి మండలంలోని ఉప్పలపాడు. తండ్రి వెంకట్రావు, తల్లి పార్వతి. తండ్రి వెంకట్రావు లైటింగ్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కుమారుడు కారు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలుస్తున్నాడు. ఈ క్రమంలో ఎస్ఐ కుటుంబాన్ని తిరునాళ్లకు తీసుకువెళ్లి తిరిగి వస్తున్న సమయంలో కారు ప్రమాదంలో మృత్యువాత పడటంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. చేతికి అందివచ్చిన కొడుకు తిరిగిరానిలోకాలకు చేరడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఇటీవలే బ్రహ్మాచారికి వివాహం చేయడానికి ఒక సంబంధాన్ని చూసినట్లు బంధువులు చెబుతున్నారు.

కనుల పండువగా లింగోద్భవ పూజలు

- శనివారం అర్ధరాత్రి నుంచి తెల్లవారు జాము వరకు పూజలు
- పాల్గొన్న జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, డీఆర్‌ఓ వినాయకం, దేవదాయ శాఖ అడిషనల్ కమిషనర్ చంద్రకుమార్



ప్రత్యేక అలంకరణలో త్రికోటేశ్వరస్వామి

నరసరావుపేట రూరల్: మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామికి శనివారం అర్ధరాత్రి లింగోద్భవ పూజలు కనుల పండువగా నిర్వహించారు. స్వామి వారికి విశేష అభిషేకాలు జరిపారు. పండ్లు, పాలు, పెరుగు, పంచదార, తేనె, గంధం, విభూదితో అర్చకస్వాములు శాస్త్రోక్తంగా అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. అర్ధరాత్రి 12.30 గంటలకు ప్రారంభమైన పూజలు తెల్లవారుజామున 4 గంటల వరకు జరిగాయి. జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ దంపతులు, డీఆర్‌ఓ వినాయకం, దేవదాయ శాఖ అడిషనల్ కమిషనర్, తిరునాళ్ల ప్రత్యేక అధికారి చంద్రకుమార్, డెప్యూటీ కమిషనర్ చంద్రశేఖరరెడ్డి, తహసీల్దార్ రమణానాయక్, ఆలయ ఈవో వేమూరి గోపి పూజల్లో పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



శివాలయంలో భ్రమరాంబ మల్లేశ్వరస్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

పెదకాకాని: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మహాశివరాత్రి కల్యాణ బ్రహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి వేదమంత్రాల సాక్షిగా శాస్త్రోక్తంగా అర్చకులు, అధికారులు, భక్తులు ఎదుర్కోల ఉత్సవం జరిపారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి వేలాదిగా తరలివచ్చిన భక్తుల నడుమ రాత్రి 2 గంటలకు ప్రత్యేక వేదికపై స్వామివారి కల్యాణ క్రతువును వైభవంగా జరిపించారు. పుల్లాభట్ల వెంకటేశ్వర్లు కల్యాణ వ్యాఖ్యానం చేశారు. భ్రమరాంబ మల్లేశ్వరస్వామివారి కల్యాణ వేడుకలు తిలకించిన భక్తులందరికీ ఉచితంగా స్వామివారి ప్రసాద కిట్ అందజేశారు. ఆలయంలో జరిగిన లింగోద్భవకాల పూజల్లో ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య తదితరులు పాల్గొన్నారు. గుంటూరు నగర మేయర్ కావటి శివనాగమనోహర్ నాయుడు మల్లేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారి కల్యాణం తిలకించి భక్తిపారవశ్యంతో తన్మయత్వం పొందారు. ఆదివారం అమ్మవారు బాలాత్రిపురసుందరీదేవిగా భక్తులను అనుగ్రహించారు. అనంతరం నంది వాహనంపై గ్రామోత్సవం జరిపారు. రాత్రి భజనకాలక్షేపం, కూచిపూడి నృత్య ప్రదర్శన, రామాంజనేయ యుద్ధం, శ్రీకృష్ణ తులాభారం, గయోపాఖ్యానం నాటికల నుంచి సీన్లు ప్రదర్శించి పౌరాణిక నాటక ప్రియులను మంత్రముగ్ధులను చేశారు.

నేడు భ్రమరాంబ మల్లేశ్వరస్వామి రథోత్సవం..

శివాలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం సాయంతం 4 గంటలకు రథోత్సవం వైభవంగా నిర్వహించడం జరుగుతుందని ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మేళతాళాలు, కోలాట, భజన, కేరళ వాయిద్యాల నడుమ రథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని వివరించారు.

ప్రశాంతంగా ఎస్ఐ ప్రిలిమినరీ పరీక్ష



గుంటూరు ఏసీ కళాశాలలో ఎస్ఐ ప్రిలిమినరీ పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థులు




ఆర్‌వీఆర్‌జేసీఈ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐజీ త్రివిక్రమవర్మ, ఎస్పీ ఆరీఫ్‌హఫీజ్

నగరంపాలెం(గుంటూరు): ఏపీ స్టేట్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ఆదివారం సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) ప్రిలిమినరీ పరీక్షలు జిల్లాలోని 23 పరీక్షా కేంద్రాల్లో ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు కొనసాగాయి. నిర్ణీత వేళలు కంటే ముందుగానే అభ్యర్థులు పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకున్నారు. ప్రతి ఒక్కరిని మెటల్ డిటెక్టివ్‌లతో తనిఖీలు నిర్వహించి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేసింది. ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలుచేశారు. జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ గుంటూరు నగరంలోని పలు పరీక్షా కేంద్రాలను తనిఖీలు చేశారు. ఏసీ కళాశాల, హిందూ ఫార్మసీ, జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. అభ్యర్థుల హాల్ టికెట్లను సరిచూశారు. కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలపై ఆయా కళాశాలల యాజమాన్యాలతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఉదయం 10 గంటలకు ప్రారంభమైన పరీక్షకు 12,727 మంది అభ్యర్థులు, మధ్యాహ్నం 2.30 గంటలకు మొదలైన పరీక్షకు 12,713 మంది హాజరయ్యారు.

పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన రేంజ్ ఐజీ..

గుంటూరు రూరల్: ఎస్ఐ ప్రిలిమినరీ పరీక్షా కేంద్రాన్ని గుంటూరు రేంజ్ ఐజీ త్రివిక్రమవర్మ ఆదివారం పరిశీలించారు. గుంటూరు రూరల్ మండలంలోని చౌడవరం గ్రామంలోగల ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. పరీక్షా కేంద్రం వద్ద డ్యూటీ చేస్తున్న సిబ్బంది ద్వారా అభ్యర్థులను తనిఖీ చేయించారు. పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. అనంతరం నగరంలోని పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంను పరిశీలించారు. పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన వారిలో జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్, ఎస్ఐ పరీక్షల చీఫ్ కో–ఆర్డినేటర్, ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సిద్దయ్య, అడ్మిన్ అడిషనల్ ఎస్పీ సుప్రజ, ఏఆర్ అదనపు ఎస్పీ కోటేశ్వరరావు, సౌత్ డివిజన్ డీఎస్పీ జెస్సీ ప్రశాంతి, నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ బి.శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ సీఐలు నరసింహారావు, శ్రీనివాసరావు, ఆర్ఐ రాఘవయ్య తదితరులు ఉన్నారు.

జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్ కప్‌కు రాష్ట్ర జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో పసుపులేటి సురేష్, రాజు

సత్తెనపల్లి: జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్ కప్ పోటీలకు ఆదివారం రాష్ట్ర జట్టును ఎంపిక చేశారు. పట్టణంలోని పవర్ హౌస్ ఫిట్‌నెస్ సెంటర్‌లో జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు పల్నాడు జిల్లా నుంచి ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు జాతీయ స్థాయిలో జమ్మూలో జరిగే పోటీలకు రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు. జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్ కప్ పోటీల్లో జూనియర్, సీనియర్ మెన్ అండ్ ఉమెన్, ఎక్విప్డ్ అండ్ అన్‌ఎక్విప్డ్ పోటీలు నిర్వహించనున్నారు. జూనియర్ విభాగంలో మాతంగి రాహుల్ గౌతం (సత్తెనపల్లి), ఎం.అనూష (కారంపూడి), సీనియర్ విభాగం నుంచి షేక్ నజీర్ (సత్తెనపల్లి) ఎంపికయ్యారు. పల్నాడు జిల్లా సెక్రటరీ పసుపులేటి సురేష్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి పతకాలను సాధించి పల్నాడు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఎంపికల్లో ప్రెసిడెంట్ జిమ్ము రాజు, గుజ్జర్లపూడి ఆనంద్, జి.రమేష్, ఎస్.మణిరత్నం, టి.శంకర్, ఎం.మదన్, షేక్ జానీ, సయ్యద్ మస్తాన్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాతంగి సాంబశివరావు, శాంతయ్య, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో 12 కిలోల గంజాయి స్వాధీనం

మధురానగర్ (విజయవాడసెంట్రల్): విజయవాడ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేసిన రైల్వే పోలీసులు 12 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విజయవాడ రైల్వే ఎస్పీ ఆదేశాలతో డీఎస్ఆర్‌పీ నాగరాజు రెడ్డి పర్యవేక్షణలో జీఆర్పీ సీఐ శ్రీనివాస్, ఆర్‌పీఎఫ్ సీఐ చంద్రశేఖరరెడ్డి, సిబ్బంది విజయవాడ రైల్వే స్టేషన్‌లో గంజాయి రవాణాపై ఆదివారం తనిఖీలు చేశారు. దీనిలో భాగంగా రాత్రి 7 గంటల సమయంలో భువనేశ్వర్ నుంచి బెంగళూరు వెళ్లే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో కేరళ రాష్ట్రానికి చెందిన కె అరాఫత్ (20) నుంచి 12 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు.

ఈ-వాహన ఒరవడి!

- జిల్లాలో పెరుగుతున్న విద్యుత్ వాహనాలు
- పట్టణాలతో పాటు గ్రామాల్లో పరుగులు పెడుతున్న ఎలక్ట్రిక్ బైక్‌లు
- పల్నాడు జిల్లాలో సుమారు 22 వేల విద్యుత్ ద్విచక్ర వాహనాలు
- నానాటికీ పెరుగుతున్న ఇంధన ధరలే కారణం
- పెట్రోల్‌తో పోల్చితే 10 శాతం ఖర్చుతోనే
- పాత వాహనాలను సైతం రెట్రో ఫిట్టింగ్ ద్వారా పెట్రోల్ నుంచి ఈవీగా మార్పు



షోరూంలో ఎలక్ట్రిక్ బైక్‌లు

సాక్షి, నరసరావుపేట: రోజు రోజుకు పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరల నేపథ్యంలో వాహనదారులు ప్రత్యామ్నాయ వాహనాల వైపు అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలోనే కాలుష్య రహిత ఈ–వాహనాల వినియోగం పెంచే దిశగా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ప్రభుత్వ ఉద్యోగులకు విద్యుత్తు ద్విచక్ర వాహనాలను వినియోగించేలా ఆంధ్రప్రదేశ్ నూతన పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (ఎన్‌రెడ్‌క్యాప్) ప్రోత్సహిస్తోంది. మరోవైపు సాధారణ ప్రజలు సైతం విద్యుత్ వాహనాల వాడకంలో ముందంజలో ఉన్నారు. గత ఏడాది పల్నాడు జిల్లాలో వందల్లో ఎలక్ట్రిక్ వాహనాలు ఉండగా ప్రస్తుతం వాటి సంఖ్య 22 వేలకు పైగా చేరిందని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో నరసరావుపేట, చిలకలూరిపేట వంటి పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో సైతం విద్యుత్ వాహనాల వాడకం పెరిగింది. జిల్లా వ్యాప్తంగా వందకు పైగా విద్యుత్ కార్లు వాడుకలో ఉన్నట్టు సమాచారం. ఈ క్రమంలో విద్యుత్తు వాహనాలకు ఎక్కడికక్కడ చార్జింగ్ పెట్టుకునే వెసులుబాటు కోసం చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని ఏ–రెడ్‌క్యాప్, ఈఈఎస్ఎల్, ఎన్టీపీసీ నిర్ణయించాయి. మరోవైపు బైక్‌లను సులువుగా ఇంటి పరిసరాల్లోనే చార్జింగ్ పెట్టుకొనే వెసులుబాటును కంపెనీలు కల్పించడంతో చార్జింగ్ చేయడం సులభంగా మారి వినియోగం పెరిగింది.



ఇంధనం ఖర్చుతోనే బైక్..

సాధారణ ద్విచక్ర వాహనానికి కి.మీ.కు రూ.2.25 పెట్రోలుకు ఖర్చయితే, ఎలక్ట్రిక్ వాహనానికి చార్జింగ్ ఖర్చు రూ.0.15 పైసలు మాత్రమే అవుతుంది. దీంతో కి.మీ.కు రూ.2.10 చొప్పున ఆదా చేసుకునే వీలుందని నెడ్‌క్యాప్ అధికారులు చెబుతున్నారు. ద్విచక్ర వాహనంపై రోజుకు 50 కి.మీ. తిరిగే వారికి నెల రోజులకు రూ.3,375 పెట్రోలు ఖర్చు అవుతుండగా, 2 కిలోవాట్ల ఎలక్ట్రిక్ వాహనానికి నెలకు రూ.225 మాత్రమే ఖర్చవుతుంది. దీంతో ప్రతి నెలా రూ.3,150 ఆదా చేసుకోవచ్చు. ఇదే నగదును నెలవారీ ఈఎంఐగా కడితే మూడేళ్లలో రూ.1.10 లక్షల బైక్ సొంతం కానుంది. పెట్రోల్ వాహనాల ఇంధన ఖర్చుతోనే బైక్‌తో పాటు, చార్జింగ్ కూడా పొందవచ్చు.

పాత వాహనాలకు రెట్రో ఫిట్టింగ్..

ఇంధన ఖర్చులు భారీగా ఆదా అవుతుండటంతో వాహనదారులు తమ పాత వాహనాలను సైతం రెట్రో ఫిట్టింగ్ ద్వారా ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చుకుంటున్నారు. సుమారు రూ.30 నుంచి రూ.50 వేల వరకు ఖర్చుచేసి పెట్రోల్ ఇంజిన్ స్థానంలో బ్యాటరీలను అమర్చుతున్నారు. పూణేలోని ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఆర్ఏఐ) ధ్రువీకరణ పత్రం ఉన్న కిట్‌లనే రెట్రో ఫిట్టింగ్ సమయంలో వాడాలి. తర్వాత ఎంవీఐ తనిఖీ అనంతరం బండి ఆర్‌సీలో మార్పులు చేసుకోవచ్చు. ఇంధన వాహనాల తరహాలో రెండు నెలలకో, మూడు నెలలకో నిర్వహణ ఖర్చులు ఎలక్ట్రిక్ వాహనాలపై ఉండదు. అయిదేళ్ల వారంటీ బ్యాటరీతో వాహనాలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి.

నెలానెలా రూ.2,500 ఆదా



వృత్తిరీత్యా నేను జిరాక్స్ షాపుతో పాటు ఫొటోగ్రఫీ చేస్తుంటాను. చుట్టుపక్కల గ్రామాలకు వెళుతుండటంతో నెలకు సుమారు 1,200 కి.మీ.కుపైగా తిరుగుతుంటాను. పెట్రోల్ వాహనంలో తిరిగే సమయంలో నెలకు రూ.2,700 దాకా ఖర్చు అయ్యేది. ప్రస్తుతం ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనం వాడుతుండటంతో చార్జింగ్‌కు కేవలం రూ.225 మాత్రమే అవుతోంది. ప్రతి నెలా రూ.2,500 ఆదా అవుతోంది. ఈ డబ్బులు కుటుంబ ఖర్చులకు వినియోగించుకునే వెసులుబాటు లభించింది. బైక్ నిర్వహణ ఖర్చులు దాదాపుగా లేవు.

– ఎ.వెంకట అమర రామిరెడ్డి, ఫొటోగ్రాఫర్, కామేపల్లి, పిడుగురాళ్ల మండలం

ప్రభలను సందర్శించిన మంత్రి విడదల రజిని



ప్రభల వద్ద భక్తులకు అభివాదం చేస్తున్న మంత్రి విడదల రజిని

నరసరావుపేట రూరల్: కోటప్పకొండలో ఏర్పాటుచేసిన విద్యుత్ ప్రభలను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని సందర్శించారు. పురుషోత్తమపట్నం, యడవల్లితో పాటు చిలకలూరిపేట నియోజకవర్గం నుంచి తరలివచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభలను ఆమె శనివారం రాత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు అండగా నిలుస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. త్రికోటేశ్వరుని ఆశీస్సులతో వచ్చే ఎన్నికల్లో కూడా వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందన్నారు. మంత్రి వెంట జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ఆలయాల హుండీ కానుకల లెక్కింపు

చినగంజాం: శివరాత్రి తిరునాళ్లను పురస్కరించుకొని ఈ ఏడాది మండలంలోని రెండు శివలయాల హుండీ ఆదాయం పెరిగినట్లు ఆలయ కమిటీలు తెలిపాయి. కొత్తపాలెం బాలకోటేశ్వరస్వామి ఆలయంలో తిరునాళ్ల సందర్భంగా హుండీ, అభిషేకాలు ద్వారా సుమారు రూ.5.45 లక్షలు ఆదాయం రాగా రామకోటేశ్వరాలయంలో నిర్వహించిన హుండీ లెక్కింపు కార్యక్రమంలో రూ.7,67,450 వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ టీఎస్సార్ ఆంజనేయులు పేర్కొన్నారు. రెండు దేవాలయాల హుండీ లెక్కింపు కార్యక్రమంలో రాజు వెంకటేశ్వరరెడ్డి, సుబ్బారెడ్డి, శేషు, కుక్కల ఏడుకొండలు పాల్గొన్నారు.

క్రీడలతో కొత్త ఉత్తేజం

ఎమ్మెల్యే ఆర్కే



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే

మంగళగిరి: క్రీడలతో నూతన ఉత్తేజం కలుగుతుందని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) చెప్పారు. నగరంలోని మస్నెం వారి బజారు చింతకింది కనకయ్య హైస్కూలు గ్రౌండ్‌లో బెంగాలీ గోల్డ్ వర్కర్స్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ప్రారంభించారు. కొద్దిసేపు బ్యాటింగ్ చేశారు. మంగళగిరి, విజయవాడ, తెనాలి, తాడేపల్లి గూడెం, వరంగల్, బెంగాలీ గోల్డ్ వర్కర్స్ జట్లు టోర్నమెంటులో పాల్గొన్నాయి. విజయవాడ వన్ టౌన్ జట్టు విన్నర్స్‌గానూ, విజయవాడ టూ టౌన్ జట్టు రన్నర్స్‌గా నిలిచారు. ఎమ్మెల్యే ఆర్కే రెండు జట్లకు ట్రోఫీల్ని అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గోల్డ్ వర్కర్స్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, గెలుపును స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.

రైళ్లు, స్టేషన్లలో డాగ్ స్క్వాడ్ తనిఖీలు




ప్రయాణికుల సామగ్రిని డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న జీఆర్పీ పోలీసులు

లక్ష్మీపురం: గుంటూరు రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు సామగ్రిని డాగ్ స్క్వాడ్‌తో జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు సమక్షంలో ఆదివారం సాయంత్రం సిబ్బంది తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు రైల్వే పార్సిల్ విభాగం, రైళ్లలో మద్యం, గంజాయి వంటివి తరలిస్తున్నారన్న సమాచారంతో తనిఖీలు చేపట్టినట్లు చెప్పారు.

రైళ్లలో తనిఖీ

తెనాలి రూరల్: గంజాయి అక్రమ రవాణాను కట్టడి చేసేందుకు రైల్వే పోలీసులు చర్యలు చేపడుతున్నారు. రైల్వే పోలీసు విభాగం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎక్కడికక్కడ తనిఖీలు చేస్తున్నారు. తెనాలి ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఫతే అలీబేగ్, జీఆర్పీ సీఐ టి. శ్రీనివాసరావు, ఎస్‌ఐ ఎల్. సరస్వతి ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం తెనాలి రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంపై ప్రయాణికుల లగేజీలతో పాటు పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లలో కూడా సిబ్బందితో కలసి తనిఖీ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల తరలింపు విరమించుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు వేళాంగిణిరాజు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల తరలింపును విరమించుకోవాలని ఏపీటీఎఫ్ (1938) జిల్లా అధ్యక్షుడు జి.వేళాంగిణిరాజు విజ్ఞప్తి చేశారు. అమరావతి రోడ్డులోని సంఘ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విలీనంతో ప్రాథమిక పాఠశాలలు కనుమరుగవుతున్నాయని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల్ని భర్తీ చేయడం లేదని తెలిపారు. రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ విజయానంద్ మాట్లాడుతూ గతేడాది జీఓ నంబర్లు 84, 85,117లను తీసుకువచ్చి 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలలకు తరలించడం ద్వారా విద్యార్థులకు విద్య దూరమవుతోందని తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.నరసింహారావు మాట్లాడుతూ పాఠశాలల విలీనాన్ని ఆపివేసి, విద్యను పటిష్టపర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు ఎం.వి.ప్రసాద్, సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల సుబ్బారావు, సహాధ్యక్షుడు పి.రమేష్ పాల్గొన్నారు.



గోవాడ ఆలయంలో దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



బాలకోటేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ

బాల కోటేశ్వరస్వామి దర్శనానికి భక్తుల రద్దీ

గోవాడ(వేమూరు): బాలకోటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. మహా శివరాత్రి ఉత్సవాలు ఐదు రోజులు నిర్వహించడం ఆనవాయితీ. భక్తులు ఆదివారం భారీగా తరలివచ్చారు. ట్రాక్టర్లు, ఎడ్లబండ్ల మీద భక్తులు గుడి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. 21వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగుతాయని దేవస్థానం కార్యనిర్వహణాధికారి అశోక్ రెడ్డి తెలిపారు. ఈ ఏడాది 2 లక్షల మంది స్వామిని దర్శించుకున్నట్లు పేర్కొన్నారు. 22న దేవస్థానం ఉత్సవ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు ఉంటుందని వెల్లడించారు. దర్శనానికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు దేవస్థానం చైర్మన్ చెరుకూరి వెంకట లక్ష్మయ్య చౌదరి తెలిపారు. మోదుకూరి హరిబాబు, మాజీ చైర్మన్ మండవ శ్రీరామమూర్తి, సాంబశివరావు, ఆర్.మోహన్‌రెడ్డి, పాటిబండ్ల సీతారామయ్య, మోపిదేవి నాగభూషణం పాల్గొన్నారు. తెనాలి, రేపల్లె, పొన్నూరు నుంచి గోవాడకు ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సులు రద్దీగా నడిచాయి.



గోవాడలో బాల కోటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

రాగద్వేషాలు, బంధుత్వాలకు న్యాయ వ్యవస్థ అతీతం

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.గంగారావు

తెనాలి: రాగద్వేషాలకు, బంధుత్వాలకు న్యాయవ్యవస్థ అతీతమని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.గంగారావు అన్నారు. కీలకమైన కేసుల్లో నిర్ణయాల్ని తీసుకోవడంలో న్యాయమూర్తులు మానసిక సంఘర్షణకు గురవుతుంటారని చెప్పారు. పని ఒత్తిడిని అధిగమించేందుకు యోగ, వ్యాయామం వంటి ఆరోగ్య సూత్రాల్ని పాటించాలని సూచించారు. తెనాలి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి టి.రామచంద్రుడు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక హోటల్ గౌతమ్ గ్రాండ్‌లో జస్టిస్ గంగారావుకు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణాజిల్లాలకు చెందిన పలువురు న్యాయమూర్తులు హాజరైన ఈ సభకు జడ్జి టి.రామచంద్రుడు అధ్యక్షత వహించారు. సభలో జస్టిస్ గంగారావు మాట్లాడుతూ న్యాయమూర్తుల తీర్పులు సమాజాన్ని ప్రభావితం చేసేలా ఉండాలని, సమాజ సేవ లక్ష్యం కావాలని తెలిపారు. కృషి, పట్టుదల, శ్రమను న్యాయమూర్తులు అలవరచుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. సభలో ప్రసంగించిన పలువురు న్యాయమూర్తులు జస్టిస్ గంగారావు వెలువరించిన తీర్పులు, ఆయన వ్యక్తిత్వం నిబద్ధత, విశిష్టతల్ని వివరించారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. తెనాలి 11వ అదనపు జిల్లా జడ్జి జి.మాలతి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ రత్నకుమార్, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ గోచిపాత శ్రీనివాసరావు, తెనాలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి అబ్దుల్ షరీఫ్, ఒకటో అదనపు జడ్జి రహంతుల్లా, శాస్త్రవేత్త డాక్టర్ ఎన్‌సీ వెంకటేశ్వర్లు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందలపు వేణుగోపాలరావు, కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్, గుంటూరు బార్ అసోసియేషన్ కార్యదర్శి వై.మధు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా ప్రసంగించారు.



జస్టిస్ గంగారావుకు ఆత్మీయ సత్కారం

కూలిన భారీ విద్యుత్ ప్రభలు

ఇద్దరికి గాయాలు

చేబ్రోలు: మహా శివరాత్రి సందర్భంగా క్వారీ తిరునాళ్లకు బయలుదేరిన రెండు ప్రభలు కూలిపోయాయి. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి దేవస్థానం వద్ద జరిగే తిరునాళ్లకు నారాకోడూరు నుంచి మూడు భారీ విద్యుత్ ప్రభలను గ్రామస్తులు సిద్ధం చేశారు. నారాకోడూరు శివాలయం ఎదురుగా జీబీసీ రహదారి పక్కన మిత్ర మండలి సభ్యులు సుమారు వంద అడుగుల భారీ విద్యుత్ ప్రభను నిర్మించారు. శనివారం రాత్రి ఆలయం వద్దకు ఊరేగింపుగా మేళ తాళాలు, యువకుల కేరింతలతో ఉత్సాహంగా బయలుదేరిన కొద్ది సేపటికే ఒరిగిపోయి పక్కనే ఉన్న దాబా మీద కూలిపోయింది. దాబా పైన కాకుండా జనం మీద పడి ఉంటే పెద్ద సంఖ్యలో ప్రాణ నష్టం జరిగి ఉండేది. ప్యాపర్రుకు చెందిన వెంకటేశ్వర్లు తలపై ప్రభకు చెందిన కర్ర పడటంతో పగిలింది. మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఇద్దరిని 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మలుపు వద్ద అలసత్వమే కారణం

ప్రభ పడిపోవటానికి మలుపు వద్ద అలసత్వమే కారణంగా తెలుస్తోంది. సుమారు వంద అడుగులున్న ప్రభకు ఇరువైపులా తాళ్లు పట్టుకునే వారు జాగ్రత్తలు తీసుకోలేదు. జీబీసీ రహదారి ఎక్కే సమయంలో మలుపు వద్ద తొందరపాటు కూడా ప్రభ పడిపోవటానికి కారణంగా స్థానికులు చెబుతున్నారు.



నారాకోడూరు వద్ద కూలిపోయిన భారీ విద్యుత్ ప్రభ

విరిగిన గుండవరం గ్రామప్రభ

మహా శివరాత్రి సందర్భంగా వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి దేవస్థానానికి వెళ్లి తిరిగి వస్తున్న గుండవరం గ్రామప్రభ ప్రమాదవశాత్తూ విరిగిపోయింది. ఈ ఘటనలో ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. గుండవరం గ్రామస్తులు ప్రభను విద్యుత్ దీపాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. శనివారం రాత్రి గ్రామంలో ఊరేగించి అనంతరం నారాకోడూరు మీదుగా క్వారీ దేవాలయానికి తీసుకువెళ్లారు. ఆదివారం తెల్లవారుజామున గ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. వేజండ్ల అడ్డరోడ్డు వద్ద 33కేవీ విద్యుత్ లైన్ల వద్ద ప్రభను కిందకు దించడం కోసం నిలుపదల చేశారు. కిందకు వంచే సమయంలో ప్రభ పై భాగం విరిగిపోయి ముందుకు వాలిపోయింది. దీంతో ఆదివారం ప్రభను అక్కడ నుంచి కిందకు దించి గ్రామానికి తీసుకువచ్చారు. లక్షలాది రూపాయిల వ్యయంతో నిర్మించిన భారీ విద్యుత్ ప్రభ విరిగిపోవడంతో యువకులు నిరుత్సాహానికి గురయ్యారు.



వేజండ్ల అడ్డరోడ్డు వద్ద విరిగిన గుండవరం గ్రామ ప్రభ

అంతర్జాతీయ సదస్సులో పేపర్ సమర్పించిన డాక్టర్ విజయ



గుంటూరు మెడికల్: న్యూరాలజిస్టుల సంఘం రాష్ట్ర నాయకురాలు, గుంటూరు లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ పమిడిముక్కల విజయ, అమెరికా డల్లాస్‌లో ఫిబ్రవరి 8 నుంచి 10 వరకు నిర్వహించిన 25 అంతర్జాతీయ స్ట్రోక్ కాన్ఫరెన్స్‌లో సైంటిఫిక్ పేపర్‌ను సమర్పించారు. వివరాల్ని ఆదివారం ఆమె మీడియాకు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా మూడువేల మంది న్యూరో సైంటిస్టులు హాజరయినట్లు ఆమె వెల్లడించారు. ఎకనామిక్ స్ట్రోక్ కేర్ మోడల్‌పై ప్రత్యేక పరిశోధనా పత్రాన్ని సదస్సులో సమర్పించామన్నారు. పురుషులతో పోల్చితే స్త్రీలకు పక్షవాతం వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని, అంతేకాకుండా దాన్నుంచి కోలుకునే అవకాశం కూడా వారికి తక్కువ ఉందనే విషయం తేలిందన్నారు. పక్షవాతాన్ని పిల్లల్లో, వృద్ధుల్లో నిర్ధారించే ఆధునిక వైద్య పద్ధతులు, చికిత్సా విధానాలు నేడు అందుబాటులోకి వచ్చిన విషయాన్ని పలువురు న్యూరాలజిస్టులు సదస్సులో తెలియజేశారని తెలిపారు. వాయు కాలుష్యానికి దీర్ఘకాలికంగా గురవ్వడం వలన పెద్ద వయస్సు వారికి స్ట్రోక్ తిరిగి వచ్చే అవకాశం ఉందని చెప్పారు. తీవ్రమైన పక్షవాతం వచ్చిన వారికి మెదడులోకి వైద్య పరికరాలు పంపి బ్లడ్ క్లాట్‌ను తొలగించే ఆపరేషన్లతో మంచి ఫలితాలు వస్తున్నాయని సదస్సులో నిర్ధారించారని వివరించారు. పక్షవాతాలను ఎమర్జెన్సీ ఎవాల్యూషన్, మేనేజ్‌మెంట్‌తో ఆపవచ్చని డాక్టర్ విజయ వెల్లడించారు. అంతర్జాతీయ సదస్సుకులో సైంటిఫిక్ పేపర్ సమర్పించిన డాక్టర్ విజయకు సీనియర్ కార్డియాలజిస్ట్, కార్డియాలజిస్టుల సంఘం రాష్ట్ర నాయకుడు డాక్టర్ పీవీ రాఘవశర్మ అభినందనలు తెలిపారు.

అగ్ని కుల క్షత్రియులు హక్కులను సాధించుకోవాలి

పటమట(విజయవాడతూర్పు): రాష్ట్రంలోని అగ్ని కుల క్షత్రియులు రాజకీయంగా, సామాజికంగా చైతన్యమై హక్కులు సాధించుకోవాలని ఏపీ అగ్ని, వన్ని కుల క్షత్రియ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బర్రి ప్రసాద్ సూచించారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పటమటలోని ఎస్‌ఆర్ కోచింగ్ సెంటర్ ఆవరణలో ఏపీ అగ్ని, వన్ని కుల క్షత్రియ సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ఆదివారం 'అగ్ని' కుల సామాజిక అభివృద్ధిపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 40 లక్షల మంది అగ్ని, వన్ని కుల క్షత్రియులు ఉన్నారని తెలిపారు. తమ పిల్లల విద్యాభివృద్ధికి ప్రత్యేక ఆశ్రమ పాఠశాలలు, కళాశాలలు ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరారు. విజయవాడ కేంద్రంగా నిర్మిస్తున్న రాష్ట్ర స్థాయి విజ్ఞాన కేంద్ర భవనాన్ని ఐక్యంగా నిర్మించుకోవాలని పేర్కొన్నారు. సంఘం నేత సైకం భాస్కరరావు మాట్లాడుతూ అగ్ని, వన్ని కుల క్షత్రియుల ఆర్థిక తోడ్పాటుకు ప్రభుత్వం సహకరించాలని కోరారు. సదస్సులో మునుస్వామి కృష్ణ, లకనం నాగాంజనేయులు పాల్గొన్నారు.

జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు నలుగురి ఎంపిక

మంగళగిరి: జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు జిల్లా నుంచి నలుగురు ఎంపికైనట్లు అసోసియేషన్ కార్యదర్శి గుమ్మడి పుల్లేశ్వరరావు ఆదివారం తెలిపారు. జమ్ము కాశ్మీర్‌లో ఈనెల 23 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్న పోటీలకు హాజరవుతారని చెప్పారు. 74 కేజీల పురుషుల విభాగంలో షేక్ అబ్దుల్ మతీన్, 57 కేజీల మహిళల విభాగంలో సాదియా అల్మస్, 84 కేజీల విభాగంలో షేక్ సబీనా, నాగం జ్ఞానదివ్య ఎంపికైనట్లు చెప్పారు. ఎండీ ఖమరుద్దీన్, షేక్ సంధానీ, శిరీష కోచ్‌లుగా వ్యవహరించనున్నట్లు వెల్లడించారు.



లిఫ్టర్లతో అసోసియేషన్ కార్యదర్శి గుమ్మడి పుల్లేశ్వరరావు, షేక్ సంధాని తదితరులు

సేవామూర్తులకు పురస్కారాలు

చీరాల అర్బన్: సమాజంపై బాధ్యతాయుతంగా ఉంటూ సాంస్కృతికపరంగా సమాజంలో పునరంకితమవుతున్న వారిని సత్కరించుకోవడం అభినందనీయమని అజోవిభో కందాళం వ్యవస్థాపకుడు అప్పాజోస్యుల సత్యనారాయణ అన్నారు. చీరాల సహజ సాహితీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక విద్యా కాలేజీలో సేవామూర్తులకు పురస్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి పీహెచ్ చెన్నకేశవులు అధ్యక్షత వహించారు. పసుమర్తి పార్థసారథరావు పురస్కారాన్ని ఆయన కుమారుడు పసుమర్తి నరసింగరావు చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ పురస్కార గ్రహీత వీకే భాస్కరరావుకు ప్రదానం చేశారు. అలానే పోలవరపు జగదీశ్వరరావు స్మారక సాహితీ పురస్కారాన్ని ఆయన కుమారుడు డాక్టర్ పోలవరపు వెంకటేశ్వరప్రసాద్ అద్దంకికి చెందిన పద్యకవి చెన్నుపాటి రామాంజనేయులకు ప్రదానం చేశారు. జూటూరి సుబ్బారావు, వరలక్ష్మి స్మారక సాంస్కృతిక సేవా పురస్కారాన్ని ఆయన కుమారుడు జూటూరి సీతారామశాస్త్రి ఆకాశవాణి, దూరదర్శన్ కళాకారులు భాగి కృష్ణమూర్తికి ప్రదానం చేశారు. సంఘ సేవకులు, విద్యావేత్త, బత్తుల సర్వీస్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు బత్తుల బ్రహ్మారెడ్డికి సాంస్కృతిక బంధు గౌరవ బిరుదును ప్రదానం చేశారు. కార్యక్రమంలో సహజ సాహితీ అధ్యక్షుడు వడలి రాధాకృష్ణ, నారిశెట్ల ప్రకాశరావు, జంపాల గంగాధరరావు, కొణికి చంద్రశేఖర్, బత్తుల పాపారావు, బందా శక్తిధర్, గాదె హరిహరరావు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.



సన్మాన గ్రహీతలను సన్మానిస్తున్న సాహితీ సంస్థ ప్రతినిధులు

కేఎల్‌యూలో ఎన్‌సీసీ రాత పరీక్షలకు స్పందన

మంగళగిరి: నగర పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో ఆదివారం ఎన్‌సీసీ క్యాడెట్లకు సీ సర్టిఫికెట్ రాత పరీక్షలు నిర్వహించారు. గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల గ్రూపు కమాండర్ కల్నల్ ఆర్.అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షలకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. మూడు జిల్లాల నుంచి 606 మంది విద్యార్థులు హాజరయ్యారు. కల్నల్ అజయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు ఉద్యోగాల సమయంలో మార్కులకు ఎన్‌సీసీ సర్టిఫికెట్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఎన్‌సీసీ అధికారి పావని మాట్లాడుతూ పరీక్ష ఫలితాలు నెల రోజుల్లో వెలువడతాయని, ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు అందజేస్తామని చెప్పారు. కేఎల్‌యూతో పాటు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, వీవీఐటీ, గుంటూరు హిందూ కళాశాల, గోరంట్లలోని సెయింట్ మేరీస్ కళాశాల, చీరాల డిగ్రీ కళాశాల వంటి ప్రముఖ కళాశాలలకు చెందిన విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో కల్నల్‌లు ఆర్‌పీ సింగ్, అజయ్ కుటినో, కుమార్ ఉమాశంకర్, గుర్నాం సింగ్, అసోసియేట్ అధికారి లెఫ్టినెంట్ ఉషా క్రాంతి, డీన్‌లు చప్పిడి హనుమంతరావు, కేఆర్‌ఎన్ ప్రసాద్, అబీబుల్లా ఖాన్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



రాత పరీక్షకు హాజరైన విద్యార్థులు

చీరాల ఆర్టీసీ డిపో ఆదాయం రూ.9.46 లక్షలు

చీరాల అర్బన్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా చీరాల డిపో నుంచి పల్నాడు జిల్లా కోటప్పకొండకు నడిపిన ప్రత్యేక బస్సులు ద్వారా రూ.9,46,748 ఆదాయం వచ్చిందని డిపో మేనేజర్ జె.శ్యామల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా శనివారం ఉదయం ఆదివారం ఉదయం వరకు మొత్తం 45 బస్సులు నడిపినట్లు తెలిపారు. స్పెషల్ బస్సులలో మొత్తం 14,828 మంది ప్రయాణించారన్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది రెండు లక్షల మేర ఆదాయం అధికంగా వచ్చిందన్నారు. అందరి కృషితో విజయవంతంగా స్పెషల్ బస్సులను నడిపామని, సిబ్బందికి అభినందనలు తెలిపారు.